ISSN:3048-5908 Impact Factor: 6.673 (SJIF)

సాహిత్య తరంగిణి

(తెలుగు పరిశోధన పత్రిక)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.

A Peer-Reviewed Telugu Journal; Volume-3, Issue-1, (Jan/Feb/Mar), 2026

# శ్రీ జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు - రామ భక్తి గేయం – పరిశీలన

శివ్వాల వాగ్దేవి

పరిశోధక విద్యార్థి,తెలుగు శాఖ,ఆంధ్ర విశ్వకళాపరిషత్,విశాఖపట్నం

Received: 13/01/2026

Article Accepted: 25/02/2026

Published Online: 26/02/2026

DOI:10.53414/Sahithyatharangini.2026.3.1.196

**సారాంశం (Abstract)**

ఈ పరిశోధనలో జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు గారి భక్తి గీతాలలోని భక్తి, ధర్మం మరియు తాత్విక భావాల విశ్లేషణ చేయబడింది."దేవుళ్ళు" (2000) సినిమాలోని "అందరి బంధువయ్య భద్రాచల రామయ్య" పాటను కేంద్రంగా తీసుకుని రామతత్వాన్ని అధ్యయనం చేశారు. రామాయణ సారం, భద్రాచల క్షేత్ర మహత్యం మరియు రాముని ధర్మనిష్ఠ ఈ గీతంలో ఎలా ప్రతిఫలించాయో పరిశీలించబడింది.కవి రచనల్లోని భక్తిరస ప్రవాహం, చారిత్రక–భౌగోళిక అంశాల సమన్వయం మరియు ప్రేరణాత్మక సందేశం విశ్లేషించబడింది.ఈ అధ్యయనం ద్వారా జొన్నవిత్తుల గారి గీతసాహిత్యంలో భక్తి గీతాల ప్రత్యేకత మరియు సాంస్కృతిక విలువ స్పష్టమవుతుంది.

**ముఖ్య పదాలు:**భక్తి గీతాలు ,జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు ,రామతత్వం ,భద్రాచలం క్షేత్రం ,తెలుగు సినీ గీతసాహిత్యం

1. ఉపోద్ఘాతం

భగవంతుడు చూపిన మార్గంలో నడవడమే నిజమైన భక్తి. కంటికి కనిపించకపోయినా ఆ శక్తి పట్ల నమ్మకంతో ముందుకు సాగడమే భక్తి. అదే మనిషిని ఈ భవసాగరం నుండి రక్షిస్తుంది. 'భగవంతునిపై అమితమైన ప్రేమను కలిగి ఉండటమే భక్తి' అని నారద మహర్షి తన భక్తి సూత్రాలలో నిర్వచించారు.భక్తి మానవునికి మానసిక ధైర్యాన్ని ప్రసాదించే పరమ ఔషధం. సంస్కృతంలో 'భజ్' అనే ధాతువు నుండి 'భక్తి' అనే పదం ఉద్భవించింది. 'భజ్' అంటే భజించడం, సేవించడం, అర్పించడం అనే అర్థాలు కలవు. భక్తి మనసును నిర్మలంగా మార్చి

ISSN:3048-5908 Impact Factor: 6.673 (SJIF)
సాహిత్య తరంగిణి
(తెలుగు పరిశోధన పత్రిక)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Issue-1, (Jan/Feb/Mar), 2026

ప్రశాంతతను ప్రసాదిస్తుంది. ఇది మనిషిలోని అరిషడ్వర్గాలను తొలగించి సన్మార్గంలో నడిపిస్తుంది. భక్తి నైతిక జీవనాన్ని, ఆదర్శ భావాలను పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తుంది.కర్మమార్గం, జ్ఞానమార్గం కంటే భక్తిమార్గం ఉన్నతమైనదిగా భావించబడుతుంది. ఇది మోక్షానికి దారి చూపే సులభమైన మార్గమని మన పురాణాలు తెలియజేస్తున్నాయి.తెలుగు సినిమాలో భక్తి గీతాలకు ప్రత్యేక స్థానం ఉంది. సినిమా ప్రారంభ దశలోనే పౌరాణిక కథలు, భక్తుల జీవితాలు ఆధారంగా భక్తిరస ప్రధాన చిత్రాలు రూపొందాయి. సాంఘిక చిత్రాలలో కూడా సందర్భానుసారంగా భక్తి గీతాలు చోటుచేసుకున్నాయి. భక్తి భావాన్ని, ఆధ్యాత్మికతను ప్రేక్షకుల హృదయాల్లో నింపుతూ సినిమా రచయితలు అనేక మధురమైన భక్తి గీతాలను అందించారు.భక్తి పరిమళాలను ప్రేక్షకుల, శ్రోతల హృదయాల్లో వ్యాపింపజేసి వారిలో ఆధ్యాత్మిక చైతన్యాన్ని మేల్కొల్పిన రచయితలు నిజంగా ధన్యజీవులు.

ఈ నేపథ్యంలో జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు గారు రాముడు, సాయిబాబా, వినాయకుడు, లక్ష్మీనరసింహస్వామి, దుర్గాదేవి, వెంకటేశ్వరస్వామి వంటి అనేక దేవతలపై సుమధురమైన భక్తి గీతాలను రచించారు. ఆయన రచనలు దర్శక–నిర్మాతల ప్రశంసలతో పాటు ప్రేక్షకుల, శ్రోతల మన్ననలను పొందాయి. భక్తి గీత రచయితగా ఆయన తెలుగు సినీ సాహిత్యంలో చిరస్థాయిగా నిలిచిపోయారు.

## 2. రచయిత పరిచయం

తెలుగు సినీ ప్రపంచంలో మధురమైన గీతాలను రచించి, శ్రోతల హృదయాలను పరవశింపజేసి, తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపును సంపాదించుకున్న వినూత్న కవి జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు గారు. భక్తి గీతాలు మాత్రమే కాకుండా హాస్యరసాన్ని పండించే పేరడీ పాటలు, ప్రేమ గీతాలు, లలిత గీతాలు, ప్రబోధ గీతాలు వంటి విభిన్న ప్రక్రియల్లో రచనలు చేసి సుప్రసిద్ధులయ్యారు.

జొన్నవిత్తుల వారి కలం నుండి వెలువడిన ప్రతి గేయం ప్రత్యేకతను కలిగి ఉంటుంది. కొత్త కొత్త ప్రయోగాలు చేయడంలో ఆయన సిద్ధహస్తులు. అచ్చమైన తెలుగు పదాలతో పాటు సంస్కృత పదాలను సమన్వయపరచి గీతరచన చేయడంలో ఆయన నైపుణ్యం విశేషంగా ప్రశంసనీయమైనది. కేవలం సినీ గేయకర్తగానే కాకుండా తెలుగు భాష పరిరక్షణ కోసం కృషి చేసిన భాషాభిమాని, సాహితీవేత్తగా ఆయన గుర్తింపు పొందారు.

ISSN:3048-5908 Impact Factor: 6.673 (SJIF)

సాహిత్య తరంగిణి

(తెలుగు పరిశోధన పత్రిక)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.

A Peer-Reviewed Telugu Journal; Volume-3, Issue-1, (Jan/Feb/Mar), 2026

జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు గారు 1959 జూలై 7న కృష్ణలంక, విజయవాడలో లక్ష్మీనరసమ్మ మరియు సుబ్బారావు దంపతులకు జన్మించారు. ఆయన తెలుగు అధికార భాష సంఘం అధ్యక్షుడిగా కూడా సేవలందించారు. ఆయన మేనమామ ద్రైత గోపాలం గారు కూడా సినీ గీత రచయితగా పనిచేశారు.

చిన్ననాటి నుండే కవిత్వంపై ఆసక్తి కలిగిన ఆయన, విద్యాభ్యాసం అనంతరం 1985లో ఆసియన్ లాంగ్వేజ్ బుక్ సొసైటీ అనే సంస్థలో ఉద్యోగం చేశారు. అయితే ఆ సంస్థ కొద్దికాలంలో మూసివేయబడటంతో ఆయన ఉద్యోగాన్ని కోల్పోయారు.

తరువాత ఒక మిత్రుని ద్వారా నటుడు మురళీమోహన్ గారితో పరిచయం ఏర్పడింది. ఆయన ద్వారా దర్శకుడు కె. రాఘవేంద్రరావు గారికి పరిచయమై, జొన్నవిత్తుల వారి ప్రతిభను గుర్తించిన రాఘవేంద్రరావు గారు 'భారతంలో అర్జునుడు' చిత్రానికి అన్ని పాటలు రాసే అవకాశాన్ని అందించారు. అయితే ఆయన రచయితగా విడుదలైన మొదటి పాట మాత్రం 'రౌడీ పోలీస్' చిత్రంలోనిది. ఈ విధంగా సినీ ప్రస్థానం ప్రారంభించిన జొన్నవిత్తుల గారు వందలాది గీతాలను రచించి తెలుగు సినీ గేయసాహిత్యాన్ని సమృద్ధం చేయడంలో ప్రముఖ పాత్రను పోషించారు.

### 3. జొన్నవిత్తుల వారి కలం నుండి జాలువారిన భక్తిరస జలపాతం

### 3.1 శ్రీరామునికి అక్షరార్చన

"దేవుళ్ళు" (2000) సినిమాలోని "అందరి బంధువయ్య భద్రాచల రామయ్య" అనే పాటను పరిశీలించినప్పుడు జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు గారి భక్తితత్పరత స్పష్టంగా కనిపిస్తుంది. ఈ గీతం ద్వారా ఆయన రామతత్వాన్ని, ధర్మసారాన్ని, భక్తిభావాన్ని అత్యంత హృద్యంగా ఆవిష్కరించారు.

మానవుడు ఆచరించాల్సిన ధర్మాలకు, నియమాలకు రామాయణం నిలయంగా భావించబడుతుంది. మానవాళికి దివ్య సందేశాన్ని అందించే మహాగ్రంథమే రామాయణం. శ్రీరాముడు సకల సద్గుణ సంపన్నుడైన ఆదర్శ పురుషుడు. ఆ రామతత్వాన్ని, రామాయణ సారాన్ని, భద్రాచల క్షేత్ర మహాత్యాన్ని కవి ఎంతో సంక్షిప్తంగా కానీ గంభీరమైన భావంతో, "సూక్ష్మంలో మోక్షం" అన్నట్లుగా ఐదు నిమిషాల నిడివిగల పాటలో హృదయానికి హత్తుకునేలా చిత్రీకరించారు.

వందేమాతరం శ్రీనివాస్ గారి స్వరకల్పనలో, ఎస్. పి. బాలసుబ్రహ్మణ్యం గారి గానమాధుర్యంతో ఈ గీతం శ్రోతల హృదయాలను స్పృశించింది. విడుదలైన నాటి

ISSN:3048-5908 Impact Factor: 6.673 (SJIF)
సాహిత్య తరంగిణి
(తెలుగు పరిశోధన పత్రిక)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Issue-1, (Jan/Feb/Mar), 2026

నుండి నేటి వరకు ఈ పాట మధురమైన భక్తి భావాన్ని ప్రసరింపజేస్తూ, శ్రోతల మనస్సుల్లో ఆధ్యాత్మిక పారవశ్యాన్ని కలిగిస్తోంది.

రామా..ఆ..ఆ..రామా..ఆ..ఆ..

అందరి బంధువయా భద్రాచల రామయ్య

ఆదుకునే ప్రభువయ్యా ఆ అయోధ్య రామయ్య

చేయూతనిచ్చే వాడయ్య మా సీతారామయ్య

కోర్కెలు తీర్చే వాడయ్య కోదండరామయ్య

"రఘుకులతిలక శ్రీరాముడిని" అనే భావప్రవాహంలో పాట ప్రారంభంలోనే 'రామా' అని ఆర్తిగా పిలవడం ద్వారా, ఆర్ద్రతతో పిలిస్తే దేవుడు స్పందిస్తాడని, కరుణను ప్రసాదిస్తాడని రచయిత సందేశాన్ని అందించారు. అంతేకాక రామనామ స్మరణ యొక్క గొప్పతనాన్ని ఈ గీతం ద్వారా స్పష్టంగా ప్రతిపాదించారు.

శ్రీరాముడు సకల జీవులకు ఆత్మబంధువుగా, సమస్త సృష్టికి ప్రభువుగా నిలుస్తాడని కవి భావవ్యక్తీకరణ చేశారు. ఆపదలో ఉన్నవారికి చేయూతనిచ్చి రక్షించే రక్షకుడిగా, కోరిన కోర్కెలను తీర్చే కరుణామూర్తిగా ఆయనను కవితాత్మకంగా, లయాత్మకంగా ఆవిష్కరించారు. ఈ విధంగా రచయిత తన అక్షరసుమాలతో శ్రీరాముడిని భక్తిపూర్వకంగా పూజించారు.

**తెల్లవారితే చక్రవర్తియై రాజ్యమునేలే రామయ్య**

**తండ్రి మాటకై పదవిని వదిలి అడవులకేగెనయా**

**మహిలో జనులను కావగ వచ్చిన మహావిష్ణు అవతారమయా**

**ఆలిని రక్కసుడు అపహరించితే ఆక్రోశించెనయా**

**అసురుని త్రుంచి అమ్మనుతెచ్చి అగ్నిపరీక్ష విధించెనయా**

**చాకలి నిందకు సత్యము చాటగ కులసతినే విడనాడెనయ**

**నా రాముని కష్టం లోకంలో ఎవరూ పడలేదయ్యా..ఆ..ఆ**

**సత్యం ధర్మం త్యాగంలో అతనికి సరిలేరయ్యా**

**కరుణా హృదయుడు శరణను వారికి అభయమొసగునయ్యా..**

దశరథుడు శ్రీరాముడిని అయోధ్య సామ్రాజ్యానికి పట్టాభిషిక్తునిగా చేయదలచి, ఆ రాత్రి తన మందిరానికి రాముడిని పిలిచి "నాయనా! రామా, రేపు ఉదయం నీకు పట్టాభిషేకం సిద్ధంగా ఉంది" అని చెప్పినప్పుడు రాముని ముఖంలో కనిపించిన ప్రశాంత చిరునవ్వు ఎంతో గంభీరతను ప్రతిబింబిస్తుంది. అయితే తదుపరి రోజు ఉదయం, అనగా తెల్లవారుజామున, "రామా! నీవు పద్నాలుగు సంవత్సరాలు వనవాసం చేయాలి" అనే ఆదేశం వచ్చినప్పటికీ కూడా అదే ప్రశాంత చిరునవ్వు ఆయన ముఖంలో నిలిచింది.

తండ్రి ఇచ్చిన మాటను నెరవేర్చడం తన కర్తవ్యమని భావించిన శ్రీరాముడు, కొడుకుగా తండ్రి ఆజ్ఞను శిరసావహించి వనప్రయాణానికి సిద్ధమయ్యాడు. సుఖభోగాలతో అలంకరించబడాల్సిన అయోధ్య యువరాజు అడవుల్లో కఠినమైన జీవితం గడపాల్సి వచ్చింది. సౌఖ్యాలను వదలి, కటిక నేలపై శయనిస్తూ వనవాస జీవితం గడపడం ఆయన త్యాగానికి ప్రతీకగా నిలిచింది. ఈ సంఘటనల ద్వారా రచయిత సుఖాలు, విజయాలు, ఆనందాలు, అధికారాలు వంటి అనుకూల పరిస్థితుల్లో అహంకారానికి లోనుకాకుండా, అలాగే కష్టాలు, దుఃఖాలు, బాధలు వంటి ప్రతికూల పరిస్థితుల్లో కుంగిపోకుండా స్థితప్రజ్ఞతతో జీవించాలనే సందేశాన్ని అందించారు. మన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించాలి, ఇచ్చిన మాటను తప్పకూడదు, తండ్రి ఆజ్ఞను గౌరవించాలి అనే నైతిక విలువలను ఈ గీతం ద్వారా స్పష్టంగా ప్రతిపాదించారు. వంశగౌరవం, కుటుంబ ప్రతిష్ఠ కోసం త్యాగపూరిత జీవనానికైనా సిద్ధపడాలనే ఆదర్శాన్ని రచయిత రామతత్వానికి అన్వయిస్తూ ప్రజలకు ప్రేరణాత్మక సందేశంగా అందించారు.

దుష్ట శిక్షణ, శిష్ట రక్షణ కోసం, మానవాళికి ధర్మమార్గాన్ని చూపించడానికి, ఎన్ని కష్టాలు ఎదురైనా ధర్మపథంలో నిలబడాలనే సందేశాన్ని ఇవ్వడానికి సాక్షాత్తు శ్రీమహావిష్ణువే శ్రీరాముని అవతారంగా భూమిపై అవతరించాడని రచయిత పేర్కొన్నారు. “ధర్మో రక్షతి రక్షితః” అనే సూత్రాన్ని ఆధారంగా తీసుకొని, ధర్మరక్షణే మానవ జీవిత ధ్యేయమని ఆయన స్పష్టం చేశారు.

సీతమ్మను మాయలేడి వెంబడించడానికి వెళ్లిన సందర్భంలో, రావణుడు ఆమెను అపహరించుకున్న తరువాత పర్ణశాలకు తిరిగివచ్చిన శ్రీరాముడు సీత జాడ లేక తీవ్ర ఆవేదనకు లోనైన దృశ్యాన్ని రచయిత భావోద్వేగభరితంగా చిత్రీకరించారు. దీనివల్ల రాముని మానవీయ కోణం ప్రేక్షకుల హృదయాలను తాకేలా ఆవిష్కృతమైంది.

దశకంఠుడు అయిన రావణుని సంహరించి సీతమ్మను తిరిగి పొందిన తరువాత కూడా, లోకాపవాదం (చాకలినింద) కారణంగా సీతను అగ్నిపరీక్షకు గురిచేయాల్సిన ధర్మసంకట స్థితిని రచయిత విశదీకరించారు. తన ప్రాణసమానురాలైన సీత పాతివ్రత్యాన్ని లోకానికి నిరూపించడానికి రాముడు తీసుకున్న ఈ నిర్ణయం ఆయన ధర్మనిష్ఠకు, కర్తవ్యబద్ధతకు ప్రతీకగా నిలుస్తుంది.

రాముని జీవితం సుఖసమృద్ధమైనది కాకుండా అనేక అగ్నిపరీక్షలతో నిండినదని రచయిత పేర్కొన్నారు. రాజ్యాన్ని కోల్పోవడం, వనవాసం, సీతావియోగం, అడవుల్లో జీవనం, యుద్ధాలు, అవమానాలు, నిందలు వంటి అనేక కష్టాలను ఆయన ఎదుర్కొన్నారు. ఈ విధంగా రాముడు అనుభవించినంత కష్టం మరెవరికీ లేదని రచయిత భావోద్వేగపూరితంగా వర్ణించారు. రాముని త్యాగం, అవతార స్వరూపం, ధర్మనిష్ఠ, దయార్ద్ర హృదయం వంటి గుణాలను అలతి పదాల్లో సమర్థంగా అభివ్యక్తీకరించారు.

విగ్రహావాన్ ధర్మః” అనగా ధర్మం మూర్తిరూపంగా అవతరించినవాడు శ్రీరామచంద్రుడు. ఆయన ధర్మానికే మార్గదర్శకుడైన ఆదర్శపురుషుడు. సత్యవాక్యత, ధర్మనిష్ఠ, త్యాగమయ జీవనం వంటి గుణాలలో ముల్లోకాల్లోనూ ఆయనకు సమానులు లేరని రచయిత తన అక్షరహారతులతో శ్రీరాముని కీర్తించారు

**భద్రాచలము పుణ్యక్షేత్రము అంతా రామమయం**
**భక్తుడు భద్రుని కొండగా మార్చి కొలువై ఉన్న స్థలం**
**పరమభక్తితో రామదాసు ఈ ఆలయమును కట్టించెనయ**
**సీతారామలక్ష్మణులకు ఆభరణములే చేయించెనయ**
**పంచవటిని ఆ జానకి రాముల పర్ణశాల అదిగో**

ISSN:3048-5908 Impact Factor: 6.673 (SJIF)

సాహిత్య తరంగిణి

(తెలుగు పరిశోధన పత్రిక)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.

A Peer-Reviewed Telugu Journal; Volume-3, Issue-1, (Jan/Feb/Mar), 2026

**సీతారాములు జలకములాడిన శేషతీర్థమదిగో**
**రామభక్తితో నదిగా మారిన శబరి ఇదేనయ్యా..ఆ ఆ..**
**రామభక్తితో నదిగా మారిన శబరి ఇదేనయ్యా**
**శ్రీరామ పాదములు నిత్యం కడిగే గోదావరి అయ్యా**
**ఈ క్షేత్రం తీర్థం దర్శించిన జన్మ ధన్యమయ్యా**

అలాగే మరొక చరణంలో సూర్యవంశపు వెలుగు శ్రీరాముడు నడయాడిన భద్రాచలం క్షేత్ర విశిష్టతను రచయిత అత్యంత భక్తిపూర్వకంగా వర్ణించారు. భక్తుడైన భద్రుని కోరిక మేరకు శ్రీరాముడు అక్కడ కొలువై ఉన్నాడని, కోరిన కోర్కెలను తీర్చే కోదండరాముడిగా ఆయన ప్రసిద్ధి పొందాడని కవి పేర్కొన్నారు. అదే విధంగా భద్రుని పేరుమీదుగానే ఈ పవిత్ర క్షేత్రానికి 'భద్రాచలం' అనే నామకరణం జరిగినట్లు భావగర్భితంగా వివరించారు.

అలాగే రామదాసు పరమ భక్తితో కానుకలను సేకరించి శ్రీరామునికి ఆలయాన్ని నిర్మించాడని, సీతారామలక్ష్మణులకు ఆభరణాలను సమర్పించాడనే చారిత్రక అంశాలను రచయిత దృశ్యరూపంలో పాఠకుల ముందుంచారు. పంచవటి, పర్ణశాల, శేషతీర్థం, గోదావరి వంటి భద్రాచల పుణ్యస్థలాలను శబరి భక్తి భావంతో అనుసంధానిస్తూ తన అక్షరాలతో అలంకరించిన తీరు విశేషంగా ఆకట్టుకుంటుంది.

పై పాటలో ప్రతి చరణంలోనూ భక్తి భావం అంతర్వాహినిగా ప్రవహింపజేయబడింది. కవి ఈ గీతం ద్వారా కేవలం భక్తితత్వాన్ని మాత్రమే కాకుండా శ్రీరాముని ధర్మనిష్ఠను, ఆయన జీవితంలో ఎదుర్కొన్న కష్టాలు మరియు ఆవేదనను కూడా భౌగోళిక, చారిత్రక నేపథ్యంతో కలిపి భద్రాచల క్షేత్ర మహత్యాన్ని హృద్యంగా ఆవిష్కరించారు. ఒకరకంగా చెప్పాలంటే రామాయణ సారం మరియు భద్రాచల క్షేత్ర గొప్పతనం రెండింటినీ స్వల్ప పదాల్లో విశాల అర్థంతో వ్యక్తీకరించిన రచనగా ఇది నిలుస్తుంది.

## ముగింపు

ఏ దైవం గురించి పాట రాయదలిచినా ఆ దైవ కథను ఐదు నిమిషాల నిడివిలో కమనీయంగా, రమణీయంగా ఆవిష్కరించగల నైపుణ్యం సినీ గేయ రచయితలకు అవసరం. ఆ నైపుణ్యాన్ని సమర్థంగా ప్రదర్శించిన రచయిత జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు గారు. ఈ పాట ద్వారా శ్రోతలు, ప్రేక్షకుల హృదయాల్లో భక్తిసామ్రాజ్యాన్ని స్థాపించిన గేయకర్తగా ఆయన చిరస్థాయిగా నిలిచిపోతారు అనడంలో సందేహం లేదు.

ISSN:3048-5908 Impact Factor: 6.673 (SJIF)
సాహిత్య తరంగిణి
(తెలుగు పరిశోధన పత్రిక)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Issue-1, (Jan/Feb/Mar), 2026

**ఉపయుక్త గ్రంథసూచి**

జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు. *జొన్నవిత్తుల గేయాలు – ఇంటర్వ్యూలు.*
పైడిపాల. *తెలుగు సినిమా పాట.*
మాదాల రుక్మిణి. *తెలుగు సినీ గీతాలు: ఒక పరిశీలన.*
ఆనందచారి, కె., మరియు శరత్‌చంద్ర తిరునగరి. *సినీ గీతావరణం.*
దేవిరెడ్డి రాధాకృష్ణారెడ్డి. *తెలుగు సినిమా పాటలు – సామాజిక స్పృహ.*
త్యాగదుర్గం మునస్వామి. *తెలుగు సినిమాల్లో హైందవ భక్తి పాటలు – వైశిష్ట్యం.*